క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప పడిపూజ



రేపల్లె రూరల్: చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని నూకాలమ్మ తల్లి ఆలయంలో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వామి పడిపూజను వైభవంగా నిర్వహించారు. మాలధారణ చేసిన అయ్యప్పస్వాములకు చద్ది (అన్నదాన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో దైవాన్ని ఆరాధించే వారికి సుఖశాంతులు కలుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి మాలధారులు పాల్గొన్నారు. అనంతరం రేపల్లె పట్టణంలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వైఎస్సార్ సీపీ నాయకుడు బొర్రా శ్రీనివాసరావు ఇరుముడి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి



కర్లపాలెం: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.బి.శ్రీధర్ కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్లపాలెం ఇస్లాంపేటకు చెందిన మహిళలు గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీతకు స్థలాల కోసం వినతి పత్రం అందజేశారు. శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు లేని వారికి ప్రభుత్వం మూడు సెంట్లతో పాటు రూ.5లక్షల నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ రత్నకుమారి, సీపీఐ మండల కార్యదర్శి షబ్బీర్ అలీ, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా బలం




భట్టిప్రోలు: ఆరోగ్యమే మహా బలం అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని బీఎఫ్ఏ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్, కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డెప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ నిర్మల గ్లోరి తెలిపారు.బీఎఫ్ఏ ఆధ్వర్యంలో సోమవారం భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో ఆరోగ్య కరమైన అలవాట్లపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల గ్లోరి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవికను అలవరచుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు, బీఎఫ్ఏ కో–ఆర్డినేటర్ మాచర్ల వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ పి. మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్ తొలగించండి

తెనాలిఅర్బన్: రక్షిత మంచినీటి పథక కుళాయి కనెక్షన్ ఉందని, దానిలో నీరు రావడం లేదని, దానిని తొలగించే విధంగా చూడాలని ఐతానగర్‌కు చెందిన దాసరి ప్రకాశరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతికి అర్జీ ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, స్థానిక నివాసులలు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మేకల పెంపకంతో ఇబ్బందులు



తెనాలిరూరల్: ఇళ్ల మధ్యలో మేకలను పెంచుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవడంతో పాటు అనారోగ్యం బారిన పడుతున్నామని మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కోడూరు వెంకయ్య అలియాస్ జోసఫ్ తమ ఇళ్ల వద్ద మేకల పెంపకం చేపట్టాడని, దీనివల్ల తమ కుటుంబ సభ్యులందరూ అనారోగ్యం బారిన పడినట్టు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. మేకలను ఇతర ప్రాంతంలో పెంచుకోవాలని అడిగితే తమపై దాడి చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆయనకు తెలిపారు.

శ్మశానాల్లోనే జీవనం.. బతుకు దుర్భరం

- కలెక్టర్ కార్యాలయం ముందు గిరిజనుల ఆందోళన
- ఇళ్లను మంజూరు చేయాలని వినతి



ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

బాపట్ల టౌన్: శ్మశానాల్లోనే నివాసాలు ఏర్పాటు చేసుకొని ఏళ్ల తరబడి జీవిస్తున్నా తమ మొర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చీరాల పట్టణం విఠల్ నగర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. విఠల్ నగర్ పరిధిలోని గొల్లపాలెం సచివాలయం సమీపంలో నక్కబుక్కల కులానికి చెందిన 18 కుటుంబాల వారం తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామని వాపోయారు. చెత్త కాగితాలు ఏరుకుంటున్న తమకు ఇల్లు అద్దెకు దొరకని కారణంగా శ్మశానాల్లోనే నివాసాలను ఏర్పాటు చేసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా పిల్లలతో నడివీధులలోనే జీవిస్తున్నామని తెలిపారు. నిలువ నీడలేని తమకు ప్రాధాన్యత క్రమంలో ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. అప్పటివరకు నైట్ షెల్టర్ ఏర్పాటు చేసి వసతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ భగవాన్‌దాస్, ఎస్. శ్రీలత పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు శ్లాఘనీయం

జిల్లా కలెక్టర్ వెంకటమురళి



గర్భిణులకు పౌష్టికాహార కిట్‌లను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల టౌన్: రెడ్ క్రాస్ సంస్థ సేవలు శ్లాఘనీయమని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విదేశాల నుంచి దిగుమతి అయిన దుప్పట్లు, పౌష్టికాహార కిట్లను 25 మంది గర్భిణులకు సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలోనే గర్భిణులకు కాన్పులు జరగాలని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో గర్భిణులు ఉండాలని, నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని ఆయన సూచించారు. పుట్టిన వెంటనే శిశువుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. సమాజానికి సేవలందించే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లులపై ఉందని తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నారాయణ భట్టు బాపట్ల జిల్లాలో అందిస్తున్న సేవలు మారువలేనివని ప్రశంసించారు. రెడ్ క్రాస్ సేవలు మానవత్వం పరిమళించేలా ఉన్నాయని జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా, వైద్య అధికారులు, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రెడ్‌క్రాస్‌ది ప్రథమ స్థానం

బాపట్ల టౌన్: సామాజిక సేవలో రెడ్‌క్రాస్ ప్రథమ స్థానంలో ఉంటుందని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యులు దేవకి వెంకట సుబ్రహ్మణ్యం ఉషారాణి సహకారంతో సంస్థ కలెక్టరేట్ ఎదుట ఏర్పాటుచేసిన మంచినీటి బోరింగ్ సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే అర్జీదారులకు ఉచితంగా భోజన సదుపాయం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య లేకుండా బోరింగ్ ఏర్పాటు చేయడంపై అభినందనలు తెలిపారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా తక్షణమే షెడ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియ, రెడ్ క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి బి.ఎస్. నారాయణ భట్టు, కమిటీ సభ్యులు డి. రామసుబ్బారావు, దేవి రమణబాబు, జె. సత్యనారాయణరాజు, బి. శ్రీరామచంద్రమూర్తి, పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు దోహదం



మంత్రిపాలెం గ్రంథాలయంలో జరిగిన చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు



కర్లపాలెం గ్రంథాలయంలో వివిధ వృత్తులను తెలిపే వేషధారణలో విద్యార్థులు



భట్టిప్రోలు గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

నగరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని డ్రాయింగ్ టీచర్ పి.బాబూరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మండలంలోని మంత్రిపాలెం శాఖా గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు సోమవారం చిత్రలేఖనం పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల్లో అంతులేని విద్యాసంపద ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సబ్ జూనియర్స్‌కు ప్రకృతిపై, జూనియర్స్‌కు నీటి పొదుపు ఆవశ్యకతపై, సీనియర్ విభాగంలో కాలుష్యం – పర్యావరణంపై దాని ప్రభావం అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు జొన్న బ్రహ్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కర్లపాలెం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కర్లపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇనకొల్లు పోలీస్‌రావు చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం విద్యార్థులు దేశంలోని భిన్న సంస్కృతులు, వృత్తులను తెలియజేసే విధంగా వేషధారణ చేసి అలరించారు. గ్రంథాలయ అధికారిణి టివి.రమణమ్మ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌రావు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన భారతదేశ సంస్కృతులు, సంప్రదాయాలు గొప్పవని చెప్పారు. విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో గ్రంథాలయాలకు వచ్చి తమకు ఇష్టమైన పుస్తకాలు చదవటం ద్వారా విజ్ఞానం పెంచుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

భట్టిప్రోలు: వారోత్సవాలలో భాగంగా భట్టిప్రోలులోని గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దేపల్లి పాఠశాల హెచ్ఎం కె. హవీలా ప్రశాంతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులు సభ్యత్వం తీసుకుని పుస్తకాలు చదువుకునే అలవాటును పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. చిత్రలేఖనం పోటీలలో 53 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి కలపాల శుభాష్‌చంద్రబోస్ పర్యవేక్షించారు.

క్విజ్ పోటీలకు స్పందన

అమర్తలూరు(వేమూరు) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అమర్తలూరు మండలంలోని ఇంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నట్లు గ్రంథాలయాధికారి కంచర్ల సుధీర్ తెలిపారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.



చుండూరు గ్రంథాలయంలో జరిగిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చుండూరు గ్రంథాలయంలో వారోత్సవాలు

చుండూరు(వేమూరు): చుండూరు గ్రంథాలయంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఒక అర్జీ, ఇంటికి మార్గం చూపాలంటూ అర్జీ, స్థలం సర్వే నిర్వహించి సర్టిఫికెట్ అందించాలంటూ ఒక అర్జీ, ఆక్రమణల సమస్యపై ఒక అర్జీ, మురుగనీటి పారుదల సమస్యపై మరో అర్జీ అందిందని తెలిపారు. సమస్యలను పరిశీలించి ఆయా శాఖల అధికారులతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

పట్టణవాసులకు ఇబ్బందులు రానివ్వొద్దు



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణను ప్రతి రోజు సక్రమంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న,అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. 6వ వార్డులో సోమ వారం వారు పర్యటించారు. వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల గ్యాంగ్ వర్క్ పనులను వారు పరిశీలించి పలు సూచనలు చేశా రు. కాల్వలలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి మురుగు పారుదల సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. వారి వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చెట్ల వేలం పాట వాయిదా

వేమూరు:జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో చెట్లు నరికి అమ్ముకునేందుకు బహిరంగ వేల పాటను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు లిక్విడేటర్ అధికారి చంద్రశేఖర్ వెల్లడించారు. ఫ్యాక్టరీ కార్యాలయంలో వేలం పాటను సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. పాటదారుల మధ్య స్వల్ప విభేదాలు ఏర్పడటంతో వాయిదా వేసినట్లు తెలిపారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు మరలా పాట నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమ వారం సాయంత్రం పట్టణ, మండల పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పాల్గొని రేషన్ పంపిణీపై డీలర్లకు, యండీయూలకు పలు సూచనలు చేశారు. రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. చిన్న చిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూని ట్ (ఎండీయూ)ల నిర్వాహకులు తమకు అందించిన సరుకులను కచ్చితంగా పంపిణీ చేపట్టాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండీయూలు అందుబాటులో లేకపోతే డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. ఇటీవల ఓ ఆపరేటర్ పోలీసులకు రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తాను స్వయంగా రేషన్ పంపిణీని పరిశీలిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, మండల పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, సీఎస్‌డీటీ మూర్తి పాల్గొన్నారు.

ముున్సిపల్ స్థలాన్ని ఖాళీ చేయండి




మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మహాత్మా గాంధీ కూరగాయాల మార్కెట్ కాంప్లెక్స్‌ను అక్రమించుకుని కొందరూ వ్యాపారులు చేస్తున్నారని, వెంటనే వారు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న సూచించారు. మున్సిపల్ మార్కెట్ వద్ద సోమవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది వ్యాపారులు అనధికారకంగా అక్కడ వ్యాపారం చేసుకోంటున్నారని తెలిపారు. షాపులు దక్కించుకున్న మరికొందరూ వ్యాపారులు మున్సిపల్ స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. తమకు కేటాయించిన షాపుల్లో వ్యాపారాలు చేసుకోవాలని, ముందుకు జరిగితే సహించేది లేదన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థకు వచ్చిందని, త్వరలో మార్కెట్‌పై అంతస్థుకు దానిని మార్చనున్నట్లు చెప్పారు. పై అంతస్థుకు వెళ్ళే మెట్లను రాకపోకలకు అనువుగా ఉంచాలని సూచించారు. సమావేశంలో ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మురుగును వెంటనే తొలగించండి

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయకపోవడం వలన ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 13,14 వార్డులలో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి ఆమె సూచనలు చేశారు. అలాగే పిచ్చిమొక్కలు మొలవడాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. కాల్వలను బాగు చేసి ఎన్నిరోజులు అయిదంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్రా సుజాత, దాసరి వీరవసంతరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎతు సూరిబాబు, పాల్గొన్నారు.

బుర్రిపాలెం రోడ్డులో ఆక్రమణల తొలగింపు



తెనాలిఅర్బన్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బుర్రిపాలెం రోడ్డులో ఉన్న ఆక్రమణలను సోమవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇతర వస్తువులను పోలీసుల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ శివన్నారాయణ మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. దీని లో భాగంగా ఆక్రమణలను తొలగిస్తున్న ట్లు చెప్పారు. కార్యక్రమంలో టీపీవో సాంబ శివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

రేపల్లె రూరల్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని శారద ఐటీఐ కళాశాలలో సోమవారం యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడకంతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు డిమాండ్



తెనాలి: కేంద్రప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం వినతిపత్రాన్ని సోమవారం సబ్‌కలెక్టర్ వి.సంజనారెడ్డికి అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతేడాది ఎకరానికి ధాన్యం దిగుబడి 40 బస్తాలు కాగా, ఈసంవత్సరం 30 బస్తాలకు పడిపోయిందన్నారు. గతేడాది 75 కిలోల బస్తా ధర రూ.1800 ఉంటే, ప్రస్తుతం రూ.1400– 1470లకు మించి కొనుగోలు చేయడటం లేదన్నారు. దీంతో రైతులు, కౌలురైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పంట దిగుబడి ఆరంభంలోనే ఇలా ఉంటే, ముమ్మరంగా హార్వెస్ట్ జరిగితే ధర ఏవిధంగా ఉంటుందోనని అన్నారు. మరోవైపు మార్కెట్లో... 26 కిలోల బియ్యం రూ.1600–1700లకు అమ్మకాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాలు ధాన్యం ధర రూ.2320, 75 కిలోల బస్తా రూ.1740లకు కొనుగోలు జరుగుతున్నందున రైతులు ఎకరాకు రూ.8 వేలు నష్టపోతున్నారని శివ సాంబిరెడ్డి విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్, రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యావసరాలు, వస్త్రాల పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ ఈరే మినిస్ట్రీస్ సంస్థ కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు, వరద ప్రభావిత గ్రామాల బాధితులకు నిత్యావసర సరుకులు, వస్త్రాలను పంపిణీ చేశారు. ఈరే మినిస్ట్రీస్ సంస్థ అధినేత బిషప్ కత్తెర సుధీర్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఈ సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. సంతోష్‌కుమారి, పి.గిద్యాన్, ఈశ్వర్, కృపాదానం, రాజు, నాని, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.